శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీ కీ జై!



# గురుకృప

శ్రీరామనవమి సంచిక



లాలాలక్ష్మీచంద్‌తో బాబా అన్న మాటలు "వెధవా! దారిలో ఓప్రక్క భజన చేస్తూనే వుంటివి. ఇక వేరే వాళ్లని అడగడమెందుకు? ఇతరులను అడిగేదేమిటి అసలు? అంతా మన కళ్లతో మనమే చూడాలి! రెండవవ్యక్తిని ఎందుకడగడం? కల నిజమో అబద్ధమో నువ్వే ఆలోచించుకో. మార్వాడీ నుంచి అప్పు తీసుకొని దర్శనం చేసుకోవలసిన అవసరమేమిటి?"

\- శ్రీసాయి సచ్చరిత్ర

సంపుటి : 13

# గురుకృప

సంచిక : 2



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీ బాబూజీ



## లోపలి పేజీలలో

సద్గురు స్మరణ - కార్యాచరణ 4
- గురుబంధువులు

అనుభవ (పుష్ప) మాల...... 8
- జి.కె

వెళ్లలేని 'దూరాలు' - సద్గురునిపై 'భారాలు' 10
- లలిత

....ఎందుకాలిడినా - గురువే నా స్థైర్యం 13
- శ్రీనివాసరావు

ఈ జీవితం 'సాయి' భిక్ష 15
- చైతన్య

నామజపమంటే.... 17
- పరమపూజ్యులు శ్రీపాండురంగ శాస్త్రి ఆఠవలె

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778

Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222



# సద్గురు స్మరణ – కార్యాచరణ

సద్గురు చరణ కమలాలకు నమస్సులర్పిస్తూ, సద్గురు స్వరూపులైన గురుబంధువులకు సద్గురు శుభాశీస్సుల ఎరుక సదా కలగాలని, సద్గురు పథంలో పయనించి, అందరూ తండ్రికి తగ్గ బిడ్డలుగా మెలగాలని ఆకాంక్షిస్తోంది గురుకృప. పత్రికలు ఎన్ని వచ్చినా, పుటలు ఎన్ని త్రిప్పినా, ఇప్పటికీ, ఎప్పటికీ నిత్య నూతనంగా, జీవకళతో, ఒక పచ్చని చెట్టులా, గలగల పారే గంగలా, మనసుకు హాయినిచ్చేది, **బ్రతుకుకు అర్థం వచ్చేది, జగతికి వెలుగునిచ్చేది – సద్గురు స్మరణ.** గురువు గురించి వింటే హాయి, కీర్తిస్తే హాయి, తలపోస్తే హాయి... అదొక అవ్యక్తమైన అనుభూతి. కబీరంతంటి వాడే సముద్రమంతా 'సిరా'గా చేసుకున్నా, గురువును కీర్తించడానికి సరిపోదంటే ఇక మనమెంత – గురుచరణాల చెంత! గురువు గురించి, గురుతత్త్వం గురించి ఎంత తెలిసినా, ఇంకా ఏదో తెలియాలనే వెలితి అందరికీ ఉండనే ఉంది. ఆ వెలితిని కొంత నింపేందుకు ఇదిగో ఒక గురుబంధువు పంపిన కొన్ని భావాలు, అవధరించండి – ఆనందించి అందరికీ పంచండి.

సృష్టిలో 84 లక్షల జీవరాశులున్నా మానవ జన్మకున్న ప్రాధాన్యత ఇంతా అంతా కాదు. ఎందుకంటే ఇన్ని జీవ రాశులున్నా ఒక్క మనుష్యునికి మాత్రమే 'బుద్ధి' అనేటటువంటి ఉపాధిని అందించాడు భగవంతుడు. మిగిలిన 83,99,999 జీవరాశులకు ఈ బుద్ధి అనే ఉపాధి మాత్రం కల్పించలేదు. అందుకే అంటారు మానవజన్మ దుర్లభమైనదని. మానవ జీవితాలకు ఒక 'పరిపూర్ణత' చేకూర్చడమే అవతార కార్యంగా పెట్టుకున్న సాయి అన్నారు "ఎందుకొచ్చినట్లు? పిడకలు ఏరుకోవడానికా? సద్గురువును తెలుసుకో" అని. గురువును తెలుసుకునేది ఎలా? అసలు ఎందుకు తెలుసుకోవాలి? అసలు **'గురువునే'** ఎందుకు తెలుసుకోవాలి? గురువు యొక్క అవసరం ఏమిటి? ఇలా ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తాయి మదిలో. మనం నిత్యం దర్శించే 'సృష్టి' మొత్తం ఏదో ఒక ప్రణాళికాబద్ధమైన, క్రమబద్ధమైన వ్యవస్థలా దర్శనమిస్తుంది. మానవ శరీర నిర్మాణం నుంచి, భూమి, సూర్యుడు ఇలా అంతా ఒక కూర్పులా తోస్తుంది. ఎక్కడ ఒక్క చిన్న పొరపాటు జరిగినా అంతా అయోమయమే! ఒక వ్యవస్థ లేకుండా ఇంకొకటి ఊహించండి. ఇలా చక్కటి కూర్పును ఏర్పరచిన 'నేర్పరి'ని భగవంతుడన్నారు పెద్దలు, మహాత్ములు.

భౌతికమైన సుఖాలను అందుకోమని మనకు ఎవరైనా ప్రత్యేకంగా చెప్పాలా? పుట్టిన క్షణం నుండి పిడకలపైకి చేరే వరకు ఎలాంటి సుఖాన్ని అనుభవిద్దామా అన్న ఆకాంక్ష ఉండనే ఉంది. చదువు, ఉద్యోగం, ప్రమోషన్, బిడ్డలు... ఇలా మన అనుకూల్యతకు ఎవ్వరి ప్రబోధము అవసరం లేదు. మరి 'గురువు' యొక్క అవసరం ఎక్కడ ఉంది. అంటే 'భగవంతుడు' ఒకడున్నాడు. ఆయనను





తెలుసుకోవాలి. ఆయన సృష్టించిన ఈ అందమైన, ఆనందమైన జగత్తును ఆయన ప్రసాదంగా జీవించాలన్న ఎరుకను మనలో కలిగించేందుకు 'గురు' స్వరూపం అవసరమవుతోంది, ఆసరాగా నిలుస్తోంది.

పెద్దలు చెప్పారు భగవంతునిపై భక్తితో ఉండమని! సరే! ఎలా ఉండడం? నీకు మొదలు ఆయన పట్ల ప్రేమ కలిగితే కదా! ఆయనను దర్శిస్తే కదా! ఆయన నాకు కలిగించిన శ్రేయస్సు అవగతమయితే కదా! అనుకున్నంత తేలిక కాదు, మనకు 'భక్తి' కలగాలంటే! మనకు 'సాయి' చేసిన ఉపకారాన్ని సమగ్రంగా చెప్పడంలో తత్తరపాటు లేకుండా, ముందు తనకు తెలిసి, తెలిసిన దానిని సాధికారికముగా, మనం అయోమయానికి గురికాకుండా, గహనమైన విషయాన్ని, చాలా తేలికగా, మనకు అర్థమయ్యే రీతిలో, మన స్థాయికి దిగి వచ్చి, మాట్లాడగలిగిన సమర్థుడై, దాని వలన అవతలివారితో తనకు లంపటము కలుగకుండా, తాను అతీతముగా ఉండి, బోధ చేసి స్వస్థతయందు తాను నిలబడగలిగినటువంటి మహాపురుషుని అవసరం మనకుంది. ఆయనను 'గురువు' అన్నారు.

సరే! ఈ గురువు ఎక్కడ నుంచి వస్తాడు? గురువు అన్నవాడు భగవంతుని కన్న భిన్నంగా ఎక్కడ నుంచో రాడు. భగవంతుని నుంచే రావాలి లేదా భగవంతుడే రావాలి గురువుగా! **గురువు చెపుతాడు నేను మిమ్మల్ని భగవంతునితో చేరుస్తాను అని. కానీ యదార్థానికి ఆయనే భగవంతుడు. భగవన్మహిమ మనకు అవగతం కావడానికి మనమెలా ఉంటామో, అలాగే కరచరణాదులతో కదిలేటటువంటి ఒక వ్యక్తిగా వ్యక్తమవుతాడు గురువు. కానీ, నడవడిచేత, జ్ఞానం చేత చాలా గొప్ప స్థితిని పొంది, నిరంతరం భగవంతునితో అనుసంధానం చేసుకోగలిగిన శక్తి కలిగి ఉంటాడు గురువు.**

గు – అంటే అంధకారం. రు – అంటే తొలగించడం – ఏ అంధకారాన్ని తొలగిస్తాడట గురువు అంటే, 'సత్య' స్వరూపమైన భగవంతుని ఉనికి మనకు తెలియచేసేందుకు – చీకటిలో మగ్గుతున్న జీవులకు దేదీప్యమానమైన దీపమై వెలుగుతాడు. ఇక గురువు 'మాట' ఎలా ఉంటుందంటే – ఎప్పుడూ మాట్లాడటానికి ప్రసిద్ధి 'కాకి' – అందుకే కాకి'గోల' అన్నారు. కాకి అరిస్తే కాకులే వస్తాయి. అదే సింహం గర్జిస్తే ఆ గర్జన వినబడినంతవరకు అన్నీ పారిపోతాయి. అలా **గురువు నోరు విప్పి మాట్లాడితే కోట్లాది జన్మల పర్యంతం వెంటబడుతున్న అజ్ఞానం అనే చీకటి విచ్చిపోతుంది. మానవునిచే 'సత్య'పదార్థాన్ని దర్శింపచేయడానికి భగవంతుడే 'గురువుగా' అవతరించడం మొదలుపెట్టాడు. అలా అవతరించిన గురువును పెద్దలు ఇలా వర్ణించారు. గురువంటే – మూడు కన్నులతో కనబడనటువంటి పరమశివుడు. నాలుగు చేతులతో కాక, రెండు చేతులతో కనిపించే శ్రీమహావిష్ణువు. నాలుగు ముఖాలతో కాక ఒకే ముఖంతో దర్శనమిస్తున్న**





**చతుర్ముఖ బ్రహ్మ.** ఇక గురుగీతలో పార్వతీదేవితో ఈశ్వరుడన్న ఈ మాటలు వింటే గురువంటే – గురుతుండిపోతాడు. "పార్వతీ – కాశీ క్షేత్రం ఉత్తర భారతంలో మాత్రమే ఉందని కదా నీవనుకుంటున్నది. నిజానికి గురువు ఎక్కడ వసిస్తున్నారో అది కాశీ క్షేత్రమయిపోతుంది. త్రివేణి సంగమ స్నాన ఫలితం ఎటువంటిదో సదా భగవంతుని దర్శించే గురుదర్శనం అటువంటిది." కనుక ఇప్పుడు గురువు ఏమవుతున్నాడు? కరచరణాదులతో కదిలి వస్తున్న త్రివేణి సంగమమే అయ్యాడు. ఆయన కాలు మోపిన చోటు కాశీ అయితే అక్కడకు గంగ వేంచేయకుండా ఉంటుందా? ఇంకా ఈశ్వరుడన్నాడు "పార్వతీ! నేను మాట్లాడను, దర్శనం ఇస్తాను. నేను నిజంగా మాట్లాడాలనుకున్నపుడు అది కాశీ క్షేత్రంలో సంచలనమవుతుంది. అందుకే నేను గురువులున్న చోట మాట్లాడతాను. వారి మాట నా మాట అవుతుంది తెలుసా?" అని.

న గురోరధికం తత్త్వం, న గురోరధికం తపః, న గురోరధికం జ్ఞానం, ... తస్మై శ్రీ గురవేనమః గురువును మించిన తత్త్వము, తపము, జ్ఞానము ఈ జగత్తున లేదు. అట్టి గురువునకు వందనమంటూ కీర్తించాడు ఈశ్వరుడు. ముక్కంటి ఇంత చక్కగా చెప్పిన గురువు ఎక్కడ లభిస్తాడు? అంటే భగవాన్ రమణులు ఇలా చెప్పారు "సాలగ్రామాలు ఎక్కడ దొరుకుతాయండి? రాళ్లలోనే సాలగ్రామాలుంటాయి. రాళ్లనన్నింటిని ఇలా ఇలా తీసేస్తే సాలగ్రామం దొరుకుతుంది. అట్టి దానిని తీసుకుని వచ్చి అభిషేకం చేస్తారు. అలానే గురువు మీ వలె సంసార మండలంలోనే ఉంటారు, ఏమీ తెలియని వాడిలా! మీరు జాగ్రత్తగా పరిశీలిస్తే మీ మనస్సు ఎవరి వాక్కు అనే అగ్నిహోత్రం ద్వారా భగవంతుని వైపు మరలుతుందో, వారే **గురువు**". దుష్ట సంహారానికి భగవంతుడు భువికి వస్తే ఆ 'పని' చాలా సులువుగా చేసుకు వెళ్లొచ్చు. అయితే 'గురువు'గా వేంచేస్తే అది 'శ్రమ'తో కూడిన వ్యవహారమే. ఒకటా, రెండా! కొన్ని కోట్ల మందిని ఉద్ధరింపచేయాలి ఆయన వేసిన బాట, చెప్పిన మాట ఎన్నో తరాలకు మార్గదర్శకత్వాన్ని అందించాలి. మొదట భగవంతుడే గురువుగా అవతరించి, తర్వాత ఆ పరంపర అలా కొనసాగిస్తున్నాడు. ఉద్ధరింప వచ్చిన 'గురువు' చేసేదేమంటే తాను 'సత్యము' నందు సదా అనుసంధానమై యుండి తన శిష్యుల (బిడ్డల) స్థాయికి దిగి వచ్చి, భోగమే పరమావధిగా ఉన్న జీవులకు యోగభోగముల సంయోజనమైన జీవనంలోని అవసరాన్ని, ఆంతర్యాన్ని, అర్థమయ్యేలా చేస్తాడు. శ్రీరామకృష్ణుల గృహస్థ శిష్యుల జీవితాలను మనం పరికిస్తే ఈ విషయం కళ్లకు కట్టినట్లు దర్శనమిస్తుంది. నిజానికి సదా సత్య పదార్థంతోనే వసించే గురువుకు బిడ్డల ప్రశ్నలు అసహ్యంగా తోచాలి. కానీ, జగత్తులోని కరుణ మొత్తం ఒకరూపుగా వచ్చిన వైనంలో ఎంతో ఔదార్యంతో బిడ్డలను ఉద్ధరిస్తాడు గురువు. శ్రీసాయివంటి సద్గురు సామ్రాట్టు శ్రీరామకృష్ణులు, భగవాన్ రమణులు, చైతన్య ప్రభువు వంటి మహాత్ములు–చిన్న చిన్న కథల రూపంలో బోధ చేయడంలోని ఆంతర్యమిదే. ఔషధంరా నాయనా! నీ రోగం తగ్గుతుంది అంటే





తీసుకుంటామా? లేదు, కాదు అంటాము. కొంచెం తీపి కలిపి నోటికి అందిస్తాడు గురువు. రోగమూ తగ్గుతుంది, భవరోగమూ మటుమాయమవుతుంది. గురువుకు గురువే సాటి.

సరే! ఇంత గొప్ప వాడైన 'గురువు'ను తెలుసుకుని ఏంచేయాలి? బాబా అలతి పదాల్లో చెప్పకనే చెప్పారు. "పని చెయ్యి. సద్గ్రంథాలు చదువు. భగవంతుని నామం ఉచ్ఛరించు" అని. భౌతిక అవసరాలకు అనుగుణమైన పనిని చేసుకుంటూ, స్వాధ్యాయ నిరతిని కలిగి ఉండి, సదా గురుస్మరణను చేసుకోవడానికి మించిన కార్యము ఏమున్నది? **'సత్య'మే తానైన గురువును స్మరించుకుంటూ సాగే జీవితంలో 'నిధి'కి చోటుండదు. 'గురుసన్నిధి'కి తప్ప! ఏ 'వ్యక్తి' యొక్క మెప్పుకోసమో జీవించడు, గురువు యొక్క 'శక్తి'ని తెలుసుకోవడానికి తప్ప! వ్యక్తుల 'ఆశల'కు చోటుండదు, కేవలం గురువు యొక్క 'ఆశయాలకు' తప్ప! 'సత్య'మునే (గురువు) సదా స్మరించే వ్యక్తి 'అసత్య' వర్తనుడై జీవించలేడు. 'ప్రేమ' ధేనువైన సద్గురువును కొలిచిన వ్యక్తి ప్రతీ అడుగులోను నీతి, నిజాయితీ, సద్ధర్మాచరణ, సత్ప్రవర్తన, శీలం, త్యాగం, దయ, క్షమ వ్యక్తమవుతాయి. అంతటితో ఆగడు. గురువు తనపై వర్షించిన ఆ ప్రేమామృతాన్ని జనులందరికి పంచి, స్వహితమే కాక జాతిహితానికి తానొక ఉద్యమకారుడే అవుతాడు. గడప గడపకు తన గురువు వచించిన మాటను, చూపిన బాటను అందించయత్నిస్తాడు.** దానాల్లోకెల్లా ఏది గొప్పదంటే అన్నదానం, వస్త్రదానం... ఇలా ఏం చేసిన మరునాటికి దాని అవసరం ఉండనే ఉంది. 'గురువు' చేసే బోధను నలుగురికి పంచితే జరిగే సత్కార్యం గమనిస్తే, మనిషి మనుగడ మారబోతుంది మహాత్ముని మాటతో! జగత్తు యొక్క గతి మారుతుంది. మహాత్ముడు చూపిన బాటలో నలుగురిని నడిపించడంలో! చరిత్ర 'చరణాలకు' ఒక కొత్త 'పల్లవి' అందుతుంది మహాత్ముని చరితను అందించడంలో! గురుచరణాలను ఆశ్రయించుకున్న జీవులు 'జ్ఞానానికి' సమగ్ర స్వరూప మవ్వాలి, 'భక్తి'కి వెలుగు దివ్వెలవ్వాలి, రాబోయే తరాలకు మార్గదర్శకమవ్వాలి. ఏ మహాత్ముని చరిత్ర చూసుకున్నా ఒక్క విషయం తప్పక అర్థమవుతుంది. ఎవరైతే 'గురువుయొక్క' విశిష్టతను తెలుసుకొని, 'గురువును' ఆశ్రయించుకుని సద్గురుపథంలో నడిచారో వారు మాత్రమే 'గురు' స్వరూపాన్ని దర్శించుకోగలిగారు. కనుక గురుబంధువుల్లారా! పదండి, మరొక్కసారి సాయికి పునరంకితమై జగతికి 'గురుశృతి'ని అందిద్దాం. జాతి గతిని మారుద్దాం. తండ్రికి తగ్గ బిడ్డలమవుదాం.

'వికృతి' నామ సంవత్సరంలో మన 'సాయిభక్తి' ఒక చక్కటి 'ఆకృతి' ధరించాలని సద్గురు అనుగ్రహాశీస్సుల ఎరుక సదా మదిలో నిలవాలని ఆకాంక్షిస్తూ...

**– గురుబంధువులు**

సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com**

సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

**గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన** mail ID : **gurukrupa@saimail.com**





# అనుభవ (పుష్ప) మాల - సద్గురు (ప్రేమ) లీల

గురుదేవులు సమర్థసద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీగారి పాద పద్మములకు నమస్సుమాంజలి. నాకు గురువుగారిని 1976వ సం॥లో చూసిన తరువాత నా జీవితంలో జరిగిన మార్పులు సాటి గురుబంధువులతో పంచుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. నేను వెంకటగిరి కాలేజీలో పనిచేస్తున్న రోజులలో, జీవితమంటే ఏ రకమైన అవగాహన లేకుండా స్నేహితులతో కాలం గడిపేవాడిని. 1976వ సం॥లో గురువుగారి స్కూలు వార్షికోత్సవమునకు కొండయ్యగారి పిలుపు మేరకు ఇద్దరం కలసి వెళ్లాము. అదేరోజు గురువుగార్ని మొట్టమొదట చూడడం జరిగింది. ఆరోజు స్కూలు వార్షికోత్సవమునకు విద్యానగర్ నుండి మాస్టారు భరద్వాజగారు వచ్చి ఉన్నారు. మాస్టారుగారు స్కూలులో బ్లాక్‌బోర్డు మీద వ్రాసి అక్కడకు వచ్చిన వారందరికి బాబా గురించి ప్రవచిస్తున్నారు. నేను కొంచెంసేపు కూర్చుని, వెళ్లిపోదామనుకొని చివరకు ఉండిపోయాను. నేను, సాయిప్రసాద్‌గారు, కొండయ్యగారు అలా సాయంకాలం కాగానే గురువుగారి రూము వద్దకు వెళ్లేవాళ్లము. అక్కడ బాబా గురించి సత్సంగం జరిగేది. ఎన్నో సందేహాలకు గురువుగారు అలవోకగా సమాధానమిచ్చేవారు. నన్ను అప్పుడప్పుడు విద్యానగర్‌కు వెళ్లి మాస్టరుగారిని తోడ్కొని రమ్మనేవారు. నేను విద్యానగర్‌కు వెళ్లి మాస్టరుగార్ని గురువుగారి రూము వద్దకు తీసుకొని వచ్చేవాడిని. మేము వచ్చేలోగా గురువుగారి రూములో తోరణాలు వగైరా మాస్టరుగారిని స్వాగతం పలకడానికి కట్టి ఉంచేవారు. ఇదేమిటి ఇలా మంగళతోరణాలు, బ్యానర్స్ కట్టి ఉంచారే అని అనుకునేవాడిని. గురువుకు ఈ విధముగా ఆహ్వానం పలకాలా అని ఆశ్చర్యపోయేవాడిని.

నేనొకసారి తీవ్రంగా అనారోగ్యం పాలైనాను.ఆవిషయం గురువుగారికి నివేదించాను. నాకు గురువుగారు హోమియో మందు ఇచ్చారు. ఆ తరువాత మళ్లీ నాకు ఆ జబ్బు తిరిగి రాలేదు. నాకు మందు వల్ల జబ్బు తగ్గలేదు. గురువుగారి అనుగ్రహము వల్లనే ఆ జబ్బు తగ్గింది. మళ్లీ ఇప్పటి వరకు ఆ జబ్బు రాలేదు. కాలేజీలో పని చేస్తుండగా ఉద్యోగరీత్యా నన్ను చాలా ఇబ్బంది పెట్టినారు. చివరకు ఉద్యోగము నుండి తొలగించాలని అనుకున్నారు. అప్పుడు నేను హైకోర్టును ఆశ్రయించాను. హైకోర్టు వారు నాకు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను గురువుగారికి చూపించగా వారు ఈ ఉత్తర్వులు ఇలా ఉండకూడదేమో అని అన్నారు. నేను ఎన్నిసార్లు ప్రయత్నించినా మా కమీషనర్ దగ్గర నుండి నాకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. చివరగా 1981లో హైకోర్టు వారు పూర్తి జడ్జిమెంటు ఇచ్చిన తరువాత నాకు సీనియర్ అసిస్టెంట్ పోస్టు స్థిరీకరించారు. తరువాత గురువుగారి ఆశీస్సులు అనుగ్రహము వలన సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ వచ్చినది. గురువుగారి సందేహానుసారంగా నా ప్రమోషన్ ఆలస్యమయింది. అప్పుడు నేను గురువుగారిని సార్ నాకు గుంటూరు ఆర్‌జెడి ఆఫీసులో పనిచేయాలని ఉన్నది, అక్కడికి పంపించండి" అని విన్నవించుకున్నాను. ఎందుకు వెళ్లాలని





అనుకుంటున్నావు అని అడిగారు. ఆడిట్, ఇన్‌స్పెక్షన్, ఎంక్వయిరీ మొదలగు విషయాలు నేర్చుకోవాలని అనుకుంటున్నాను అని అన్నాను. దానికి గురువుగారు సరేలే అన్నారు. ఆ తరువాత నేను గుంటూరు, ఆర్‌జెడి ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ అయ్యాను. అది గురువుగారి దయ. ఒకసారి గురువుగారు నిన్ను ఈ ఉద్యోగములో చూడాలని అనుకోవడం లేదు అని అన్నారు. ఆ మాట గురువుగారు అన్న వెంటనే నాకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చింది. అప్పుడు కాని అర్థం కాలేదు గురువుగారి ప్రేమ.

ఒకసారి శిరిడీ వెళ్లినపుడు తిరిగి ఇంటికి బయలుదేరేముందు గురువుగారికి చెప్పి సెలవు తీసుకుందామని వారి గదికి వెళ్లాను. అప్పటికి కొంతమంది గురువుగారితో మాట్లాడుతున్నందున, నేను కొంచెంసేపు వేచి ఉందామని గురువుగారి గదిలో ఒక మూల కూర్చుని కళ్లు మూసుకుని ధ్యానములో కూర్చున్నాను. అలా ఎంతసేపు కూర్చున్నానో తెలియదు. కళ్లు తెరిచేటప్పటికి గురువుగారు నా వైపే చూస్తున్నారు. అప్పుడు ఎలా ఉందని గురువుగారు అడిగారు. నేను చాలా ఆనందంగా ఉంది సార్ అని అన్నాను. రోజూ ఇలాగే ధ్యానం చేసుకో అని చెప్పారు. ఇటువంటి అనుభవం ముందెన్నడూ నాకు రాలేదు. నాకు అప్పుడు అర్థమైంది. మహాత్ముల దగ్గర ఇంత ఆనందకరమైన అనుభవాలు వస్తాయని. 2008వ సం॥ జూలైలో గురువుగారు "నీకొక పెద్ద జబ్బు చేస్తుంది" అని అన్నారు. "మీరే నన్ను కాపాడాలి" అని అన్నాను. ఆగస్టులో పక్షవాతం వచ్చింది. నాలుగు రోజులు అది పక్షవాతం అని గుర్తించక ఏవో మందులు వాడాను. ఆ తరువాత పక్షవాతమని గుర్తించి, మందులు వాడడం మొదలుపెట్టాను. నాకు త్వరగానే స్వస్థత చేకూరింది. సాధారణంగా పక్షవాతం వచ్చిన వెంటనే మందులు వాడితేగాని త్వరగా నయం కాదు. కాని నేను ఆలస్యంగా మందులు వాడినా, జబ్బు పెద్దది కాకుండా కోలుకోగలిగాను. ఇది కదా గురువుగారి అనుగ్రహం అని రెండు కన్నీటి బిందువులు చిందాయి నా కళ్లలో! త్రికాలజ్ఞుడు కదా గురువుగారు!

గురువుగారు బాబా అంటే ఏమిటో, ఆధ్యాత్మికత అంటే ఏమిటో, జీవితమంటే ఏమిటో తెలియని నాబోటి వాడిని సాయిపథములో నడిపిస్తూ అ,ఆలు దిద్దిస్తున్నారు. దీనికి గురుదేవులకు ఎల్లప్పుడూ కృతజ్ఞుడను. ఒక సొంత గృహము లేని నన్ను ఆశీర్వదించారు. ఒక గృహము కట్టుకుందామని గురువుగారి అనుమతి అడుగుతూ ఆ గృహానికి మీ పేరే పెట్టుకుంటానని ప్రార్థించడం జరిగినది. గురువుగారు ఇచ్చిన ఆ ఇంటికి శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ పథం అని పేరు పెట్టుకుని నా కుటుంబంతో స్వగృహములో జీవిస్తున్నాను. జీవితమంటే, బాబా అంటే, ఆధ్యాత్మికత అంటే ఏమీ తెలియని నా బోటివారిని ఎంతో మందిని చేయి పట్టుకుని నడిపిస్తున్నారా అని మననం చేసుకుంటూ శేష జీవితాన్ని గురువుగారి పాదపద్మాల స్మరణలో గడుపుతున్నాను.

– జి.కె, వెంకటగిరి





# వెళ్లలేని 'దూరాలు' – సద్గురునిపై 'భారాలు'

పంచాయతీరాజ్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నన్ను లోకల్ బాడీ నుండి గవర్నమెంట్ స్కూల్ లిస్ట్ లోకి వేసేసారు. ట్రాన్స్‌ఫర్ సమయమునందు గవర్నమెంట్ స్కూల్‌లోనే చేరవలెనన్న ఉత్తర్వులు జారీ చేసారు. జిల్లావ్యాప్తంగా ఇరవై స్కూల్స్‌లో మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు ఉన్నవి. బంగారుపాళ్యంలోని మా మండలంలోనే ఖాళీ పోస్టులు లేవు. నేను తంబళ్లపల్లి, పెద్ద మాండ్యం లాంటి మారుమూల ప్రాంతాలకు మాత్రమే వెళ్లాలి, అవి బంగారుపాళ్యం నుండి 100 కి.మీ. పైగా దూరం. నేను ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంతమంది గవర్నమెంట్ ఉద్యోగుల వద్దకు తిరిగినా ఈ జాబితా మారదని ఖచ్చితంగా చెప్పేసారు. అలాంటి పరిస్థితులలో గురువుగారు మాత్రమే ఏదైనా చేయగలరు అని భారం వారి మీద వేసాను. సాయిపథంకు ఫోన్ చేసి చెప్పిన తరువాత నేను డిఇవో ఆఫీస్‌కు వెళ్లడం జరిగింది. అక్కడ హేమాద్రి అనే టీచర్ బాబా పంపినట్లుగా ఎవరిని కలవాలో నాకు తెలియచేశారు. అతను చెప్పినట్లు గానే లెటర్ వ్రాసి డిప్యూటీ డి.ఇ.వో.ను సంప్రదించగా అతను డి.ఇ.వో. వద్దకు పంపించారు. అతను ట్రాన్స్‌ఫర్ కౌన్సిలింగ్ ఆఫీసర్ వద్దకు తీసుకుని వెళ్లి మా సమస్యను తెలియచేశారు. ఆయన ముందు అందరిలానే మాట్లాడారు. ప్రమోషన్స్ బాగా వస్తాయి తీసుకోండి అని చెప్తున్నారు. ఆ మాటలు వినగానే దుఃఖం ఆగలేదు. అక్కడే భోరున ఏడ్చేసాను. నా బాధను చూసి ఆయన డి.ఇ.వో.గారితో ఆమెకు ఎలా సౌకర్యమో అలా చేయండి అని చెప్పారు. ఇది బాబా అనుగ్రహమే అనుకుంటున్నాను. డి.ఇ.వో.గారు నా పేపర్స్ మీద ఒక ప్రక్కగా సంతకం చేసి కంప్యూటర్‌లో లిస్ట్ మార్పు చేసుకోమన్నారు. రాత్రి 11గం॥ల వరకు అక్కడ ఉండి కంప్యూటర్ ఆపరేటర్‌ను బ్రతిమలాడుతూ ఉన్నాను. అయినా చేయలేదు. మళ్లీ గురువుగారికి ఫోన్ చేసి మరుసటి రోజు మళ్లీ వెళ్లాను. మధ్యాహ్నం 11గం॥లకు మా లిస్ట్ కన్‌ఫర్మ్ అయ్యింది. ప్రస్తుతం గురువుగారి కృప వలన ఇంటికి దగ్గరలోనే 8 కి॥మీ॥ దూరంలో నాకు పోస్టింగ్ ఇవ్వడం జరిగింది.

–లలిత, బంగారుపాళ్యం

# అభయం – శుభం

పూజ్య గురుదేవులు సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ పాద పద్మములకు నమస్కరించి, నా అనుభవం గురుబంధువులతో పంచుకుందామనే సంకల్పం గురువుగారి ఆశీర్వాదం వల్లనే అని అనుకుంటున్నాను. ఇది వరకు చాలాసార్లు అనుకున్నాను. గురుకృప చదువుతుంటే నాకూ రాయాలని అనిపించి, నా అనుభవం మీతో పంచుకుంటున్నాను. మాకు గురువుగారు పరిచయం అయిన





40 రోజులకు మేము తిరుమల వెళ్లాము. అక్కడ గురువుగారి దర్శనం మాకు అయ్యింది. నేను, మావారు గురువుగారి దగ్గర కూర్చున్నాము. మావారు గురువుగారితో ఇలా చెప్పారు "గురువుగారూ! నేను విపరీతమైన తలనొప్పితో బాధపడుతున్నాను" అని. గురువుగారు తగ్గిపోతుందని చెప్పి, ఊదీ ఇచ్చారు. ఇక ఆ తరువాత మావారికి తలనొప్పి లేదు. నేను బాబా గుడిలో ఈ అనుభవాన్ని పొందాను. గులాబీమాల బాబా విగ్రహానికి వేయమని పూజారికి ఇస్తే ఆయన ఆ మాల తీసుకొని బాబా బొటనవ్రేలికి తగిలించి ఆ తరువాత బాబా సమాధిపై వేసారు. నేను తిరిగి వస్తూ, బాబా ప్రక్కన నిలబడి తలవంచి నమస్కారం చేస్తూ, తల పైకెత్తాను. అంతే! గులాబీమాల నా మెడలో పడింది. నాకు మధురానుభూతి కలిగింది. మెడలో పడిందేమంటే బాబా ఆమెను అనుగ్రహించారు అని పూజారి అన్నారు. నేను చెపితే గురువుగారు ఈవిషయం విని 'శుభం' అని అన్నారు. మాకు చాలా సంతోషం కలిగింది. మా వారికి తలనొప్పి తగ్గింది. నేను జలుబు, ఆయాసంతో బాధపడుతుంటాను. బాబా ఊదీయే అన్నింటికీ ఔషధంగా వాడుతుంటాను, తగ్గిపోతుంది. అనుక్షణం గురువుగారి ఆశీర్వాదం మాకు ఉందని ఆశిస్తున్నాను.

– సూర్యకుమారి, పాత సింగరాయకొండ.

## గురువుపై భారం – సాయి చూపించే ఉపకారం

నేను మొదటిసారి శిరిడీకి వచ్చింది, అదే గురువుగారిని మొదటిసారి చూడటం కూడా. పిల్లలతోపాటు వచ్చాను. రెండు నెలలకు ముందే రిజర్వేషన్ చేయించుకున్నా టికెట్స్ కన్‌ఫర్మ్ కాలేదు. అవస్థలు పడుతూ ప్లాట్‌ఫామ్ మీదే దుప్పటి పరచుకుని మొత్తం మీద శిరిడీ చేరాము. తిరుపతి బాలసుబ్రహ్మణ్యం గారిని కలిసి రూమ్ గురించి అడిగాము. చాలా కష్టంగా ఉందమ్మా అంటూ ఆయన వెళ్లిపోయారు. "నిన్నే నమ్ముకుని పిల్లలతో పాటు వచ్చాను. నువ్వే దారిచూపాలి బాబా" అనుకుంటూ బాబా మీదే భారం వేసి సాయిపథం వద్దనే నిలుచుని ఉన్నాను. అప్పుడు రవి అనే అబ్బాయి వచ్చి "ఇక్కడ బంగారుపాళ్యం నుండి వచ్చింది ఎవరు?" అని అడిగాడు. నేనే అని చెప్పాను. రండి మీకు రూమ్ చూపిస్తాను అని చెప్పి తీసుకువెళ్లాడు. ఏ వివరాలు అడగకుండానే బయలుదేరాను. చావడి వద్దకు వచ్చాక, నిన్ను ఎవరు పంపించారు అని అడిగితే బాలసుబ్రహ్మణ్యంగారు అని చెప్పాడు. గురుపూర్ణిమ అయిన తరువాత మేము ఇంటికి చేరి కృతజ్ఞతలు చెప్పడానికి బాలసుబ్రహ్మణ్యంగారికి ఫోన్ చేసాను. అప్పటికే నా మనసులో ఎక్కడో ఏదో తెలియని భావం, బాబాయే ఆ అబ్బాయిని పంపించారని! అనుకున్నట్లే బాలసుబ్రహ్మణ్యం గారి నుంచి సమాధానం సరిగ్గా రాలేదు. సెప్టెంబర్ 7న బంగారుపాళ్యం సత్సంగ వేడుకలకు మళ్లీ అందరం కలిసాము. అప్పుడు మళ్లీ బాలసుబ్రహ్మణ్యంగారిని నలుగురిలో ఉండగా కదిపాను.



ఆయన అప్పుడు అందరినీ వినమంటూ "ఈమె నన్ను రూమ్ గురించి అడిగింది, నేను లేవని చెప్పాను. అంతేకాదు, నేను అసలు ఈమెకు రూమ్ కావాలని ఎవ్వరికీ చెప్పలేదు. కానీ, నేను రూమ్ ఇప్పించాననుకుంటోంది" అన్నారు. ఆ సమయానికి నాకు శిరిడీలో రూమ్ చూపించిన కుర్రాడు కూడా అక్కడే ఉన్నాడు. అతను తిరుపతి గురుబంధువు, వార్షికోత్సవానికి అని అక్కడికి వచ్చాడు. అతనికి రూమ్ గురించి బాలసుబ్రహ్మణ్యంగారు పురమాయించలేదని, తనకు చెప్పిన అతను ఎవరో కొత్త వ్యక్తి అని ఆ అబ్బాయి చెప్పాడు. బాబాయే ఆ విధంగా వచ్చి నాకు సహాయం చేసారు అనుకుంటున్నాను.

మా ఇంట్లో కుట్టు మిషన్ పాడయిపోయి చిత్తూరు తీసుకువెళ్లవలసి వచ్చింది. వేరే ఎవరి సహాయం లేకుండా చిత్తూరు తీసుకువెళ్లడమంటే కష్టం నాకు. బాగుచేసే అబ్బాయిని పిలిచి చూడమని చెప్పాను. అబ్బాయి వల్ల కూడా కాలేదు. ఇక దానిపై ఊదీ వేసి ఉంచేసాను. మరుసటి రోజు చూస్తే చక్రం చాలా ఈజీగా తిరుగుతూ ఉంది. బాగు చేయడానికి వచ్చి వెళ్లిన అబ్బాయి కూడా ఆశ్చర్యపోయాడు.

-వి.దేవకి, బంగారుపాళ్యం

## పాట్లు - సద్గురుని ఏర్పాట్లు

నేను, లోకేష్, అమరావతి, వేరే ఇద్దరు గురుబంధువులు అందరం కలసి  గురుపూర్ణిమ మరుసటి రోజు పల్లకీ ఉత్సవం తరువాత చిత్తూరు బయలుదేరాము. గురువుగారిని ఆరోజు దర్శించుకోకుండా వెళ్లడం ఇష్టం లేదు. మేము క్యూలో ఉన్నాము. గురువుగారు సాయినామంలో పాల్గొని వెళ్లారు. అంతా అయ్యేటప్పటికి రాత్రి పది గంటలు అయ్యింది. గురుచరణ్ నుంచి బాబా నామం చెప్పుకుంటూ కోపర్‌గావ్ రైల్వే స్టేషన్‌కు బయలుదేరాము. కొంతదూరం వెళ్లాక కాల్ చేస్తే ట్రెయిన్ అప్పటికే స్టేషన్‌లో ఆగి ఉందన్నారు. మేము వెళ్లేసరికి కోపర్‌గావ్ స్టేషన్‌లో ట్రెయిన్ కనిపించింది. అయితే మేము చూసింది భోజ్‌పూరి ఎక్స్‌ప్రెస్. మేము మహారాష్ట్ర ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి. ఆటో అతను కూడా చెప్పాడు. మీరు ఎక్కవలసిన ట్రెయిన్ అది కాదు అని. కాని ఫ్లై ఓవర్ ఎక్కి దిగే టైమ్ లేదు కనుక కనిపిస్తున్న ట్రెయిన్ ఎక్కి రెండోవైపు దిగి, మహారాష్ట్ర ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి అనుకున్నాము. మాలో ముగ్గురమే దిగిన తరువాత ట్రెయిన్ కదిలింది. ఇంకా ఇద్దరు దిగవలసి ఉంది. వారిలో ఒక పెద్దామె కూడా ఉన్నారు. లోకేష్ ఎక్కి ఆమెను దించుదాము అని ప్రయత్నించే లోపు ఆమె దూకేసారు.ఆమెకు ఏమీ కాలేదు. అది అలా ఉంటే  నేను మహారాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌లోకి బాబా ఫోటోస్‌తోపాటు ఎక్కాను. అంతే ట్రెయిన్ కదిలిపోయింది. ఇంకా కొన్ని లగేజీలు ఉన్నాయి. చాలా గట్టిగా భయంతో అరిచేసాను. పెట్టెలో అందరూ కూడా బెదిరిపోయారు.



ఏమో ఎలా జరిగిందో మొత్తానికి అందరూ ఎక్కారు. లోకేష్ లగేజ్ అంతా లోపలికి విసిరేశాడు. అందరూ కదులుతున్న రైలు ఎక్కేసారు. ఆశ్చర్యమేమంటే మేము తప్ప వేరే ఎవరూ ఆ ట్రెయిన్ అందుకో లేకపోయారు. ఇంకొక ఆశ్చర్యమేమంటే మేం దిగిన భోజ్‌పురి ట్రెయిన్ ఎదురుగా ఉన్న మహారాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌లో మేము ఎక్కిన భోగీ తలుపు తప్ప వేరే ఏ తలుపు తీసిలేదు. అంటే మాకు ఎదురుగా ఉన్న తలుపు మాత్రమే తీసి ఉంది. ఎన్ని అవరోధాలు ఎదురైనా బాబా-గురుదేవులు మాత్రం మాకు సద్గురు దర్శనాన్ని ప్రసాదించారు, సమయానికి రైలు అందించి, మమ్మల్ని చిత్తూరు చల్లగా చేర్చారు.

**-పుష్పలత, బంగారుపాళ్యం**

## ఏ దేశమేగినా - ఎందుకాలిడినా - గురువే నా స్థైర్యం

బాబా గురుదేవుల పాద పద్మములకు నమస్కరించుకుంటూ నా అనుభవాన్ని గురుబంధువులతో పంచుకుంటున్నాను. నాపేరు శ్రీనివాసరావు. గురువు తన బిడ్డల్ని గురించి తలపోయని క్షణం ఉండదు అనేది నాకు క్షణక్షణం ఎరుక పరుస్తున్నారు గురువుగారు. నేను సత్సంగాలకి వచ్చేది చాలా తక్కువ. నా భార్యని క్రమంగా సత్సంగాలకి తీసుకుని వెళుతున్నారు శ్రీబాబూజీ. బాబా-గురువుగారు చూపిన కరుణ, రక్షణ అక్షర రూపంలో వ్రాయలేను. ఎందుకంటే గురువుగారు చూపిన కరుణ ఎంత రాసినా తక్కువే. నేను 18 సం॥ ఒకే కంపెనీలో పనిచేసాను. 4,000 జీతం. 12 సం॥లు టైపిస్టు, 6 సం॥లు కంప్యూటర్ వర్క్‌చేసాను. చివరగా గురువుగారి దయవలన లక్ష రూపాయలు ఇప్పించారు. గురువుగారి దయతో దుబాయ్ వెళ్లాను. అక్కడ ఆఫీసులో నాకు తెలిసిన వర్క్ ఇప్పించారు. 25,000 జీతం. వచ్చే జీతం ఖర్చులకు, మా కుటుంబానికి సరిపోయేది. అప్పటికి రెండు సం॥లు అయ్యింది. 18 నెలలు డ్యూటీ చేసాను. ఫైనల్‌గా లక్షరూపాయలు ఇప్పించారు.మళ్లీ క్రొత్త ఉద్యోగం ఇప్పించమని ఎనిమిది నెలల నుంచి అడుగుతూ ఉన్నాను. కొత్త ఉద్యోగం అయితే జీతం ఎక్కువ. మూడు నెలలు డ్యూటీ ఉంటుంది. ఒక నెల సెలవులో ఫ్యామిలీ దగ్గర ఉండవచ్చు. కాని చాలా రిస్కు. ఎందుకంటే నా దగ్గర ఏ అర్హతలు లేవు. నా మనస్తత్వానికి గాని, నేను చేస్తున్న డ్యూటీకి గాని అసలు సంబంధం లేనిది కోరుతున్నాను. నేను ఒకటే అనుకున్నా డ్యూటీ నేను చేస్తాను అనుకుంటే భయం. కాని, అది బాబా-గురువుగారు చేయిస్తున్నారు అనుకుంటే నాకు ఎందుకు భయం. ఉద్యోగం ఎడారిలో, పైగా పోర్ట్ లిఫ్ట్ ఆపరేటర్‌గా (డ్రైవింగ్) పది దేశాలకి చెందిన వాళ్ల మధ్య చేయాలి. అమెరికా, పాకిస్తాన్, రష్యా, ఈజిప్టు, ఇలా ఎన్నో దేశాల వాళు ్ల. క్షణక్షణం ఒత్తిడి. అక్కడ మనవాళ్లు ముగ్గురు, నలుగురు కంటే ఉండరు. మిగతా అందరూ





ఇతర దేశాల వాళ్లే. పది రోజులు ట్రైనింగ్ అయ్యాను. కనీసం నా బరువు 55 కేజీలు ఉండాలి. నేను 47 కేజీలు ఉన్నాను. నాకు షుగర్ ఉంది. ఆ పోర్ట్‌లో లిఫ్ట్ చేయాల్సినవి టన్నుల్లో ఉంటాయి. వీసాకి మూడు లక్షలు కట్టాలి. అప్పటికి 1,80,000 అప్పు చేసి కట్టాను, నా భార్యకి ఇవేవీ తెలియవు. ఇవన్నీ తెలిసిన తరువాత ఆమె 'మీరు ఇబ్బంది పడకుండా ఇండియాకి వచ్చేయండి. నేను, పాప ఉండలేకపోతున్నాం' అని ఫోన్‌లో ఒకటే ఒత్తిడి. చివరకు తను 'మీకు ఏది చేయాలనిపిస్తే అది చేయండి' అని ఏడుస్తూ ఫోన్ కట్ చేసింది. మానసిక ధైర్యాన్ని కొంటే వస్తుందా, అది ఎవరూ ఇచ్చేది కాదు. తీసుకునేది కాదు. గురువుగారు దూదిలా ఉన్న నా మనసుని, మేకులా తయారుచేసి డ్యూటీకి పంపించారు. నైట్ డ్యూటీలు, అలాగే నాకు తెలిసిన వాళ్లు 2,3 సం॥లు డ్యూటీ చేస్తున్నా మేనేజ్‌మెంట్ దగ్గర ఒత్తిడితో ఉంటారు. పది రోజులు డ్యూటీ చేసాను. మా ఫ్రెండ్స్ నుంచి ఒకటే ఫోన్స్. ఎలా ఉంది అక్కడ పరిస్థితిఅని. నాకు మా గురువుగారు, బాబా ఉన్నారు. అన్నీ వాళ్లే చూసుకుంటారు. నేను సంతోషంగా డ్యూటీ చేసుకుంటున్నాను అని చెప్పాను. ఒక నెల రోజులు డ్యూటీ చేసాను. ముడుకుల నొప్పులు. డ్యూటీ చేయలేను. మళ్లీ గురువుగారిని వేడుకున్నాను. మీమీద భారం వేసి ఇంత రిస్క్ చేసాను. మీరే చూడండి అని. 20 రోజులు సెలవు ఇప్పించారు. 2 నెలలు అయ్యింది. డ్యూటీలో జాయిన్ అయ్యాను. నేను పోర్ట్‌లో టన్నుల్లో ఉండే పైపు లిఫ్ట్ చేస్తుండగా నా దగ్గర వర్క్ చేస్తున్న అతని కాలుపైన పడింది. నా తప్పు అయితే లేదు, కాని చూస్తుండగానే అతని కాలు బాగా వాచిపోయింది. అక్కడికి అందరూ వచ్చేసారు. కొత్త వాళ్ల దగ్గర వర్క్ చేయాలంటే రిస్క్ అని అనుకున్నారు. డాక్టర్ చూసి ఫ్రాక్చర్ అని సిటీ హాస్పటల్‌కు పంపించారు. ప్రతి రిగ్గుకి మెసేజ్‌లు పంపించి నోటీసు బోర్డులు పెట్టారు. అప్పుడు నా గురించి ఆలోచించలేదు. మళ్లీ గురువుగారిని అడిగాను. గురువుగారూ కష్టం, బాధ ఎవరిదైనా ఒకటే! మీరే ఎలాగైనా అతన్ని కాపాడాలి అని చెప్పుకున్నాను. సిటీ హాస్పటల్‌లో స్కానింగ్ తీసారు. ఆశ్చర్యం! ఫ్రాక్చర్ కాలేదు. **పైగా దెబ్బ తగిలిన వ్యక్తి నాకు ధైర్యం చెప్పి, నా తప్పులేదు, తనదే తప్పు అని కేసు రాసి ఇచ్చాడు.** ఏ పొరపాటు లేకపోయినా, పొరపాటు చూపించి మరీ ఇండియా పంపించేస్తారు. అలాంటిది గురువుగారి కృప వలన నన్ను డ్యూటీలో కొనసాగిస్తున్నారు. పైగా అందరి సహకారం ఉంది. భోజన సమయంలో భోజనానికి వెళ్లమని చెప్పి, నా పని వాళ్లు చేస్తున్నారు. అక్కడ భోజనం పూటకి 8 రకాల కూరలు. రోజుకి 40 రకాల ఫుడ్ ఐటెమ్స్. నేను డ్యూటీలో ఉండేటపుడు ఖాళీ సమయంలో బాబాచరిత్ర, గురుకృపలు చదువుతూ, బాబానామం చెప్పుకుంటూ ఎప్పటికపుడు ధైర్యంగా డ్యూటీ చేసుకుంటున్నాను. మన కుటుంబాన్నే కాక, మనతోటి ఉద్యోగుల గురించి అడిగిన వెంటనే వారిని రక్షించారు బాబా-గురుదేవులు. గురువుగారు చూపిన ప్రేమ వలన నాకు, నా భార్యకి కొంత పరిణతి వచ్చింది. అది కేవలం గురువుగారి ప్రసాదం. – **శ్రీనివాసరావు, గాజువాక**

# ఈ జీవితం 'సాయి' భిక్ష – ఇక ఎప్పటికీ సద్గురువే రక్ష



నా పేరు చైతన్య. మాది తెనాలి. నేను రాస్తున్న ఈ అనుభవం స్వానుభవం కాదు. అసలు ఇది అనుభవమే కాదు. ఊహించని పరిస్థితులు, మానసిక సంఘర్షణలు, సద్గురు కృపా విశేషంతో ఈరోజు ఉన్న వ్యక్తిగత స్థితులు.

నేను, నా స్నేహితుడు కృష్ణ పది సంవత్సరాల క్రితం ఇదే సమయంలో గుంటూరులో ఎంబిఎ చదువుతూ రోజూ కాలేజీ కోసం ఒక ఐదు కి.మీ. నడక సాగించేవాళ్లం. కాలేజీ నుంచి నేషనల్ హైవే మీదకు నడిచి వస్తే నేను వాడితో అంటూ ఉండేవాడిని. "ఏదో ఒకరోజు మన ముందు మా గురువుగారు కారు ఆపి మాట్లాడతారు" అని. అప్పట్లో బాబా, గురువుగారి గురించి వాడితో మాట్లాడుతుండినా ఆ సమయానికి అది మాటలకే పరిమితమయ్యింది. ఉద్యోగరీత్యా వాడు చెన్నై, నేను హైదరాబాద్ చేరాము. మా అన్నయ్యకు చెన్నైలో ఉద్యోగం రావడం, వాడికి వసతికై కృష్ణ దగ్గరకు వెళ్లడం, మా అన్నయ్య మిషగా కృష్ణ– బాబాకు, గురువుగారికి దగ్గరయ్యాడు. కొన్ని సందర్భాలలో కృష్ణ దగ్గరకు చెన్నై వెళ్లినపుడు అర్థమయ్యింది. బాబా–గురువుగార్ల పట్ల వాడి అభిమానం ప్రేమగా మారి, 'సాయి'ని ఇలవేల్పుగా చేసుకున్నాడని! చెన్నై గురుబంధువులకు వాడంటే ఎంతో ఇష్టం, వాడిది అందరినీ నవ్వుతూ పలకరించే మనస్తత్వం. వాడికి ఒక పాప. పూజ్య గురుదేవులు 'సాయితపస్వి'గా నామకరణం చేసారు. కృష్ణకు, నాకు మాత్రం ఉన్న బంధం ఏమంటే నాకు సుమారు వంద మంది స్నేహితులు ఉన్నారు. అయితే ఒక్కడు మాత్రమే 'సాయి'ని ఆశ్రయించాడు. 'గురువుగారి'ని కొలిచాడు.

ఏప్రిల్ 22వ తేదీ 2009 ఉదయం 7.30ని॥లు అయ్యిందనుకుంటా. కృష్ణ వాళ్ల అన్నయ్య ఫోన్ చేసాడు. "నేను, కృష్ణ, తమ్ముడు కలిసి హైదరాబాద్ వచ్చాము, కృష్ణకు అక్యూట్ మైలాయిడ్ ల్యుకేమియా అని గుంటూరులో చెప్పారు" అన్నాడు. నేను మందులమ్మే వాడిని. నాకు కొంచెం తెలుసు. నాకు నోట మాట రాలేదు. కృష్ణకు బ్లడ్ క్యాన్సర్ అంటే నాకు చాలా అయోమయంగా తోచింది. కాసేపు కాళ్లు, చేతులు వణికాయి. ఇలాంటి పరిస్థితి నా జీవితంలో ఎదురుకాలేదు. దీన్ని ఎలా ఎదుర్కోవాలో క్షమించండి వాడు దీన్ని ఎలా ఎదుర్కొంటాడో అర్థం కాలేదు. అన్నయ్య వాళ్ళు చెప్పిన హాస్పటల్‌కు వెళ్లాను. కొంతసేపాగి, డాక్టర్ రూమ్‌లోనికి వెళితే వైద్యం యొక్క పవిత్రత తెలియని వాడనుకుంటా! చాలా కటువుగా పరిస్థితిని వివరించాడు. అది విని బయటకు రాగానే కృష్ణ నాతో అన్నాడు "ఒరేయ్! గురువుగారికి చెప్పండిరా నా పరిస్థితి! నాకేం చేయాలో తోచడం లేదు", అని. చెన్నైలో ఉన్న మా అన్నయ్యకు ఫోన్ చేసాను. వాడు వెంటనే గురువుగారింటికి వెళ్లి అక్కడ ఉన్న వాళ్లకు ఈ విషయం తెలియచేశాడు. వెంటనే కృష్ణను



హాస్పటల్‌లో చేర్చమన్నారు. పెద్దవాళ్లతో మాట్లాడాక వాడిని నిమ్స్‌లో చేరుద్దామని అనుకున్నాము.

తరువాత రోజు నుంచే కీమోథెరపీ ప్రారంభిద్దామన్నారు. అయితే వాడు ఆ వైద్యాన్ని తట్టుకొనే శారీరక శక్తి కలిగి ఉండాలన్నారు వైద్యులు. వైద్యం ప్రారంభమయిన ఒకటి, రెండు రోజులకే డాక్టర్లు వాళ్ల అశక్తతను వ్యక్తం చేసారు. "కృష్ణకు ఇక మూడు రోజులు మాత్రమే జీవించే అవకాశం ఉందని, చక్కగా ఇంటికి తీసుకువెళ్లమని" ఓర్పుగా చెప్పారు. విషయాన్ని ఎలా జీర్ణించుకోవాలో తెలియలేదు. చెన్నై ఫోన్ చేసి చెప్పడం, బాధపడడం తప్ప ఏం చేయగలం? కృష్ణకు, నాకు ఇలా మనందరికీ శ్రీబాబాజీనే కదా ఆసరా! ఆయన అనుగ్రహముంటే ఈ పరిస్థితిని అధిగమించగలమేమో అనిపించింది. ఇంతలో అన్నయ్య నుంచి ఫోన్ వచ్చింది. గురువుగారు ఒక గురుబంధువు చేతికిచ్చి "ఊదీ"ని కృష్ణకు అందించ మన్నారని. ఆ గురుబంధువు జాగు చేయకుండా చెన్నై నుంచి కొన్ని గంటల్లోనే విమాన మార్గంలో హైదరాబాద్ వచ్చి నిమ్స్ హాస్పటల్‌కు చేరాడు. కృష్ణ చేతికి 'గురుదేవులు' అందించిన 'ఊదీ'ని అందించాడు. ఎంతో భయంగా ఉన్నా ఎక్కడో తెలియని ధైర్యం, మేము శ్రీబాబాజీ బిడ్డలం, ఆయన కృష్ణను తప్పక కాపాడతారని! ఈ రోజుల్లో హాస్పటల్‌కు వెళ్లాల్సి రావడమే ఒక పెద్ద ఇబ్బంది. వైద్యులు మాతో మాట్లాడతామంటే ఏదో ఒక తెలియని భయంగా ఉండేది.

ఏదో ఒక అవయవ వ్యవస్థ పని చేయడం ఆగిపోతోందని చెప్తూ ఉన్నారు డాక్టర్లు. కృష్ణ వాళ్ల అన్నయ్య, తమ్ముడు, ఇలా ఆ కుటుంబ సభ్యుల పరిస్థితి చాలా దయనీయంగా మారింది. ఎవ్వరికీ వాళ్లని పలకరించే ధైర్యం లేదు. అందరూ నిద్రలు లేని రాత్రులు గడిపారు. వాళ్లకి ధైర్యం, స్థైర్యం బాబానే. ఎంతో కలతకు లోనైనా కృష్ణ మాత్రం కృంగిపోలేదు. నిజానికి వాడు మాకందరికీ ధైర్యం చెపుతూ వచ్చాడు. వాడిని కలవడానికి అంతగా అవకాశం లేకపోయినా కలిసినపుడల్లా వాడు ఒక్కటే అడిగేవాడు. "ఒరేయ్ గురువుగారికి చెప్పండిరా! నా పరిస్థితి" ఎప్పటికప్పుడు చెన్నై గురుబంధువులు గురుదేవులకు విన్నవిస్తూ వచ్చారు పరిస్థితులను. పూజ్య గురుదేవుల చేతుల మీదుగా అందిన సాయి పాద ధూళి వాడికి జీవితాన్నిస్తుందని అందరి ఆశ. అలాగే జరిగింది. డాక్టర్ల మాటలకు, వాడి ఆరోగ్యంలో వస్తున్న ప్రగతికి పొంతన లేదు. మూడు రోజులు అందరికీ చాలా ఇబ్బందిగా గడిచాయి. కృష్ణలో చాలా మార్పు కనిపించింది. మొదట సైకిల్ కీమోథెరపీ, కొన్నాళ్లకు రెండవ సైకిల్ అలా మెల్లగా జరిగిపోయాయి. ఎందరో గురుబంధువుల ప్రేమ, ఆప్యాయతలు గురుదేవులు ఎక్కడ దర్శనమిచ్చినా వాడి గురించి ఆయనకు తెలియచేయడంలో వ్యక్తమయ్యాయి. మధ్యమధ్యలో వచ్చే అన్ని ఇబ్బందులను కేవలం గురుదేవులను స్మరించినంత మాత్రమునే తొలగించారు. మొదట్లో గురుబంధువులు చెన్నై ఫోన్ చేసి కృష్ణ ఆరోగ్యం గురించి చెప్తుండేవారు. మెల్లగా వాడే ఫోన్ చేసి వాడి గురించి చెప్పుకోవడం మొదలు పెట్టాడు. కాలం గడిచిపోయింది.





కృష్ణ మూడవ సైకిల్ కీమోథెరపీ సమయంలో ఉన్నట్లుండి వాడికి చాలా ఇబ్బంది అయ్యింది. నోటి నుండి చాలా రక్తం పోయింది. ప్లేట్‌లెట్స్ బాగా తగ్గిపోయాయి. శరీరంలోని ఏ అంగమూ సహకరించడం లేదు. సెలైన్ బాటిల్స్, ప్లేట్‌లెట్ బ్యాగ్స్, ఇలా ఏదైనా సరే శరీరం బయటనుండి స్వీకరించడం లేదు. వాడి కనుగుడ్లు బయటకు వచ్చేస్తాయేమో అన్నంత భయం వేసింది. అంత ఇబ్బంది పడుతున్నా వాడు మాత్రం గురువుగారి ఫొటో, సాయి పాదధూళి ప్యాకెట్ మాత్రం వదలలేదు. వాడి తెగువ చూసి, సాయిబాబా, గురుదేవుల పట్ల వాడి విశ్వాసం చూసి నాకు నోట మాట రాలేదు. కృష్ణకు ఆరోగ్యరీత్యా కొంచెం స్థిరం చిక్కాక, గురుదేవులు అరుణాచలం వచ్చారని తెలిసి వారిని దర్శించుకోవడానికి కృష్ణ కుటుంబంతో కలిసి అరుణాచలం వెళ్లాను. అపార కరుణామయులు, మూర్తీభవించిన 'సాయిప్రేమ'కు సాకార స్వరూపము, మా ఇలవేలుపు అయిన పూజ్యశ్రీసాయినాధుని శరత్‌బాబూజీ కృష్ణను, వాడి శ్రీమతిని, చిన్నారిని దీవించిన, పలకరించిన తీరు చూడడానికి రెండు కళ్లు చాలవు. జీవితంలోని కొన్ని క్షణాలకు మనం 'సాక్షులం' అయితేనే బాగుంటుంది. 'మాటల' పరిధి చాలా పరిమితం. నూతన సంవత్సర ప్రారంభంలో కృష్ణ కుటుంబం శిరిడీ చేరి శ్రీబాబూజీ దర్శనాన్ని, వారి చేతులమీదుగా 'తపస్వి' విద్యకు ఆదిగా 'సాయిబాబా' అన్న అక్షరాలను రాయించుకున్నారు.

ఇదిగో కళ్లముందు సుమారు సంవత్సరం గడిచిపోయింది. వాడు పూర్తి చేయాల్సిన కీమోథెరపీ సైకిల్స్ అన్నీ పూర్తి చేసి ఆరోగ్యంగా ఉన్నాడు. కొంత కాలం గడిచాక డాక్టర్లు ఇక ఏమైనా ఇబ్బందిగా అనిపిస్తే తప్ప హాస్పిటల్‌కు రావాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణ మెల్లగా ఆఫీసుకు వెళ్లడం మొదలుపెట్టాడు. ఇప్పుడు మేమిద్దరం కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుతూ జీవిస్తున్నాం. వాడికి, నాకు అసలు ఇక ఏ ఇబ్బంది రాదని, మాకు భయం లేదని చెప్పను, కానీ ఎక్కడో ఒక మూలన చిన్న ధైర్యం, కొండంత అండగా బాబూజీ ఉన్నారు. మేము ఆయన బిడ్డలం. మాకు కబుర్లు చెప్పుకోవడం అలవాటే, కష్టాలను ఎదుర్కోవడమూ అలవాటే.

**– చైతన్య, తెనాలి.**

## నామజపమంటే

ఒకరోజు వాగ్గేయకారుడు, శ్రీరామచంద్రుని అనుంగు భక్తుడు అయిన త్యాగరాజు సంచారియై యోగానందాశ్రమానికి అరుదెంచారు. యోగానందుని భక్తిమయ పవిత్ర జీవితాన్ని తిలకించి, భగవంతుని దర్శనమయ్యేలా తనకు మంత్రోపదేశం చేయుమని ప్రార్థించాడు త్యాగరాజు. "నీవు ఏ రాముని ఉపాసకుడవో ఆ రామనామాన్ని కోటిసార్లు జపించు" వచించాడు యోగానందుడు. త్యాగరాజు అతని పలుకులను శ్రద్ధతో నాలకించి కోటి





జపం చేయ నిశ్చయించాడు. యోగానందుడతని సంకల్పాన్ని గ్రహించాడు. వెడుతున్న త్యాగరాజును పిలిచి, "ఏం చేయాలో గ్రహించావా?" అంటూ ప్రశ్నించాడు. రామనామజపం చేస్తానని త్యాగరాజ ప్రత్యుత్తరమిచ్చాడు."త్యాగరాజు! నీవు విద్యావంతుడవు, బుద్ధిమంతుడవు, ప్రజ్ఞావంతుడవు. నామజపమంటే ఇదేనా నీవు అర్థం చేసుకున్నది?" అన్నాడు యోగానందుడు.

ఒక కోటి నామజపం అంటే ఓ కోటి జనానికి రామనామము నొసగుట, వారిని రాముని యందు ఉన్ముఖులుగా చేయుట. ఈనాడు మానవుడు సంపాదిస్తాడు, తింటాడు, పడుకుంటాడు, పశువులా చస్తాడు. తనను రక్షించే భగవంతుని విస్మరించాడు. ఇలాంటి దైవ విముఖులను పరమాత్మని వైపు త్రిప్పుము. వారు తినువేళ, పడుకునే వేళ, మేల్కొను వేళ ఇతర కార్యము లొనరించు సమయములందు భగవంతుని స్మరించుమని ఉపదేశించాలి. ఇదే వాస్తవమైన నామజపం- అని ఉద్బోధించాడు యోగానందుడు.

త్యాగరాజు, వారి ధర్మపత్ని కమలాంగన ఇరువురు ఇంటింటికి వెళ్లి వీణపై ప్రభుగుణగానం చేసి పశుతుల్యమైన జీవితం గడిపే వారిని మానవులుగా జీవించేలా చేసారు. రామనామం స్మరించునట్లు చేసారు. త్యాగం, భక్తి, సంగీతం అతని సొత్తు. దానితోపాటు కర్మయోగం. ఇలాంటి దైవ భక్తునికి నలుబది సంవత్సరాల ప్రాయంలో వాక్శుద్ధి ప్రాప్తమయ్యింది. కాని దానిని క్షణములోనే ప్రభు చరణములో అర్పించాడు. "ప్రభూ! నాకు సిద్ధి అక్కరలేదు. నాకు నీ పాదపద్మములందు స్థానము నొసగుము" అంటూ వేడుకున్నాడు.

త్యాగరాజు విద్యను భక్తిని, సంగీతాన్ని దైవ కార్యమందు వినియోగించాడు. ఓ కోటి మానవుల జీవితాల్ని మార్చివేసాడు. వాక్శుద్ధి ప్రాప్తమయినను దానిని కూడా నా చరణములందే సమర్పించాడు. ఇలాంటి మహాభక్తుని దర్శించాలని, ఆలింగనం చేసుకోవాలని ఆతృత చెందాడు శ్రీరామచంద్రుడు.  ఏ విధంగా ఈ మహాభక్తుడు రామనామం ద్వారా అనంతమైన పాషాణ జీవుల్ని తరింపచేశాడో అదే విధంగా మనం కూడా పాషాణ తుల్యమైన, నీరసమైన, బరువైన బ్రతుకులను భగవంతుని ఆధారంతో తరింపచేసుకోవాలి. సద్గురువు ఇట్టి శక్తి నొసగు గాక!


**"శ్రాద్ధం"** – పరమపూజ్యులు శ్రీపాండురంగ శాస్త్రి ఆఠవలెగారి ప్రవచనాల సంగ్రహం నుండి



"మహాశయా! ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే నేను భరించలేను" అన్నాడు వినమ్రంగా. అందుకు శ్రీరామకృష్ణులు ఇలా జవాబిచ్చారు : "ఎవరో నన్ను విమర్శించినా లేక శ్లాఘించినా ఎవరూ పట్టించుకోనక్కర్లేదు. నిరర్థక వ్యక్తినైన నన్ను విమర్శించడం వలన అతడికి లాభం ఏమిటి? నన్ను ప్రస్తుతించే వ్యక్తికి పది జాడీల బంగారు నాణాలు ఇచ్చే శక్తి లేదా నన్ను నిందించే వ్యక్తికి పది కొరడా దెబ్బల శిక్ష ఇచ్చే శక్తి నాకు లేదు. నేను జగజ్జనని బిడ్డను. ఆమె ఇచ్ఛానుసారమే ఈ లోకంలో జీవిస్తున్నాను.

మన్మోహన్ మిత్రా

- దైవంతో సహజీవనం - 2



అనుగ్రహమే అంతటా అలరారుతుంటే,
మాకింక ఎందుకు మనసంతా చింత!
మీ రూపే జగమంతా భాసిల్లుతుంటే మాకింక
ఎందుకు సంశయంబగు మనసు



మీ రూప చింతనే మాకు ధ్యానంబు,
మీ నామధేయమే మాకు స్మరణంబు!
మీ మందహాసమే మాకు మననంబు,
మీ చరణ కమలమే మాకు శరణమ్ము!